
# సాక్షి సూర్యాపేట

బుధవారం ၊ 25 ၊ సెప్టెంబర్ ၊ 2024



**విహారంలో విషాదం!**

వైజాగ్‌కాలనీ సాగర్ వెనుక జలాల వద్ద వరుస ఘటనలు విషాదాలుగా మిగులుతున్నాయి. - 8లో

### సాగర్ సమాచారం



| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు | |
| ప్రస్తుత నీటి మట్టం | : 589.30 అడుగులు |
| ఇన్‌ఫ్లో | : 44,666 క్యూసెక్కులు |
| అవుట్ ఫ్లో | : 44,666 క్యూసెక్కులు |
| విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా | : 28,217 క్యూసెక్కులు |
| కుడికాల్వ ద్వారా | : 10,200 క్యూసెక్కులు |
| ఎడమకాల్వ ద్వారా | : 3,849 క్యూసెక్కులు |
| ఏఎమ్మార్పీకి | : 1,800 |
| వరద కాల్వకు | : 600 క్యూసెక్కులు |

### మూసీ సమాచారం



| | |
|---|---|
| పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు | |
| ప్రస్తుత నీటి మట్టం : 643.90 అడుగులు | |
| ఇన్‌ఫ్లో | : 2,691 క్యూసెక్కులు |
| అవుట్‌ఫ్లో | : 4,535 క్యూసెక్కులు |
| ఎడమకాల్వకు | : 265.81 క్యూసెక్కులు |
| కుడికాల్వకు | : 265.81 క్యూసెక్కులు |

## న్యూస్‌రీల్

### ఇరిగేషన్‌పై మంత్రులకు అవగాహన లేదు

- ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

**సూర్యాపేటటౌన్ :** ఇరిగేషన్‌పై మంత్రులకు అవగాహన లేదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యలపై పై విధంగా స్పందించారు. మంగళవారం సూర్యాపేటలోని క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఖమ్మం మంత్రుల అత్యుత్సాహం, నల్లగొండ మంత్రుల చేతగాని తనంతోనే కాలువ కట్టలు తెగిపోయాయని ధ్వజమెత్తారు. మంత్రుల వైఫల్యాలు అధికారుల మీద నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాలసీ వల్లే కాలువల మరమ్మతులు ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. అంతటా నీళ్లు సముద్రంలోకి వెళ్తుంటే ఇక్కడ మాత్రం పొలాలు ఎండుతున్నాయన్నారు. వెంటనే కాలువల మరమ్మతు పనులు పూర్తి చేసి పొలాలకు నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఒక్క వ్యవస్థకూడా సరిగా పనిచేయడం లేదని విమర్శించారు.

### విద్యార్థులు భవిష్యత్‌పై లక్ష్యంతో చదువుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి మీరా

**గరిడేపల్లి:** విద్యార్థులు భవిష్యత్‌పై లక్ష్యంతో చదువుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి షేక్. మీరా సూచించారు. ×విద్యార్థి దశలో ఆలోచన విధానం– విద్యార్థి పాత్ర¥ అనే అంశంపై మంగళవారం గరిడేపల్లి కేజీబీవీలో బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ప్రతి ఒక్క విద్యార్థి ఆలోచన విధానంలో మార్పు రావాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శైలజ, ఉపాధ్యాయులు ఎల్. కల్పన, ఎం. సుహాసిని, బి. రమ, సుశీల, అనురాధ, ఎస్. కవిత, స్వప్నకుమారి, ఎం.డీ. షాహిన్‌బేగం, బాల రక్ష భవన్ అధికారులు ఎస్‌కె మీరా, సాయిత్రిలోక్ పాల్గొన్నారు.

### క్షేత్రపాలకుడికి ఆకుపూజ

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీ ఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజ విశేషంగా నిర్వహించారు. అంజనీపుత్రుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతోపాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో ఆకుపూజ జరిపించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగాయి. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం జరిపించారు. సాయంత్రం వెండి జోడు సేవలు వంటి పూజలు కొనసాగాయి.

### యాదాద్రి కొండ కింద వన మహోత్సవం

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం కొండ కింద ఎస్పీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఎస్పీఎఫ్ కమాండెంట్ త్రినాథ్‌లు కొండ కింద పరిసరాల్లో వివిధ రకాల మొక్కలు నాటారు. అనంతరం ఈఓ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. ఆలయానికి వచ్చే భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదాన్ని పంచేందుకు వివిధ రకాల మొక్కలు నాటామన్నారు. వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# ‘ఇన్‌స్పైర్ మనక్’పై అనాసక్తి!

**ఆవిష్కరణల రిజిస్ట్రేషన్లపై శ్రద్ధ పెట్టని స్కూళ్లు**

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3,836 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు
- ఒక్కో బడి నుంచి ఐదు పంపాలని నిబంధన
- 546 స్కూళ్ల నుంచి మాత్రమే 1,945 ఆవిష్కరణలు ఆన్‌లైన్‌లో నమోదు
- అక్టోబర్ 15వరకు గడువు పెంచిన విద్యాశాఖ



**ఆన్‌లైన్‌లో ఆవిష్కరణల రిజిస్ట్రేషన్లు జిల్లాల వారీగా..**

| జిల్లా | ప్రభుత్వ స్కూళ్లు | ప్రైవేట్ స్కూళ్లు | రిజిస్ట్రేషన్ చేసుకున్నవి | ఆవిష్కరణల సంఖ్య |
|---|---|---|---|---|
| సూర్యాపేట | 950 | 300 | 151 | 562 |
| నల్లగొండ | 1483 | 199 | 312 | 1,171 |
| యాదాద్రి | 753 | 151 | 83 | 212 |

**సూర్యాపేట టౌన్:** పాఠశాలల స్థాయిలోనే విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తూ వారితో కొత్త ఆవిష్కరణలు చేయించాలనే లక్ష్యంతో రూపొందించిన ప్రేరణ(ఇన్‌స్పైర్ మనక్) కార్యక్రమానికి కొన్ని పాఠశాలల విద్యార్థులే ఆసక్తి చూపుతున్నారు. మిగతా పాఠశాలలు ఈ కార్యక్రమానికి దూరంగా ఉంటున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం పాఠశాల విద్యార్థుల నుంచి ఆవిష్కరణల నామినేషన్లను స్వీకరించారు. గడువు ముగిసే సమయానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1945 ఆవిష్కరణల నామినేషన్లు మాత్రమే వచ్చాయి. దీంతో ప్రభుత్వం ప్రేరణ నామినేషన్ల దరఖాస్తుల గడువును వచ్చేనెల వరకు పొడిగించింది.

**50శాతం కూడా దాటని ఆవిష్కరణల నమోదు**

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు 3,186, ప్రైవేట్ స్కూళ్లు 650 ఉన్నాయి. ఇన్‌స్పైర్ మనక్ అవార్డుల కోసం ఒక్కో పాఠశాలలో 5 నుంచి 10 తరగతి చదువుతున్న విద్యార్థులు కనీసం ఐదు ఆవిష్కరణలు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విద్యాశాఖ నిబంధన పెట్టింది. అయితే ఇప్పటి వరకు కేవలం 546 పాఠశాలల నుంచి మాత్రమే 1945 నామినేషన్లు వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఆవిష్కరణల నామినేషన్లు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియ జూలై 1న ప్రారంభమై ఈ నెల 15తో ముగిసింది. కానీ లక్ష్యంలో 50శాతం దరఖాస్తులు కూడా దాటలేదు. ఉమ్మడి జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండటాన్ని గమనించిన రాష్ట్ర విద్యా శాఖ అక్టోబర్ 15వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ల గడువును పొడిగించింది.

**ఆసక్తి చూపని ‘ప్రైవేట్’**

ఇన్‌స్పైర్ మనక్‌పై ప్రభుత్వ పాఠశాలలు కొన్నే ఆసక్తి చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక, ప్రైవేట్ పాఠశాలలు మాత్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదని విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కొంత మంది ఉపాధ్యాయులు ఆసక్తి చూపిస్తున్నా కొన్ని తరగతుల్లో విద్యార్థులు తక్కువగా ఉండడం, ఉన్న విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు లేకపోవడం సమస్యగా మారింది. బాలలు తయారు చేసిన ప్రాజెక్టులు, ఆవిష్కరణలతో సైన్స్ మేళాలను ఆర్భాటంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలు ప్రేరణ మనక్ ప్రదర్శనల వైపు వారిని అడుగులు వేయించడంపై దృష్టి పెట్టడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో నామినేషన్లను రిజిస్ట్రేషన్ చేసుకునేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని విద్యాశాఖ వర్గాలు సూచిస్తున్నాయి.

**అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**



ఇన్‌స్పైర్ మనక్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం గడువు పెంచింది. వచ్చేనెల 15వరకు అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని అన్ని పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలి. ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇన్‌స్పైర్ మనక్‌పై దృష్టి పెట్టాలి. అత్యధికంగా నామినేషన్లు పంపేలా ఉపాధ్యాయులు కృషిచేయాలి.

– దేవరాజ్, జిల్లా సైన్స్ అధికారి, సూర్యాపేట



నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ కాల్వ కట్ట మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, చిత్రంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, అధికారులు

# గత ప్రభుత్వ నిర్వాకంతోనే గండ్లు

- వర్షాలకు నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**నడిగూడెం, చిలుకూరు:** పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన నిర్వాకం వల్లనే సాగునీటి కాల్వలు, చెరువులకు గండ్లు పడుతున్నాయని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. నీటి పారుదల శాఖను నిర్వీర్యం చేయడమే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై కావాలనే నిందలు వేస్తున్నారని అన్నారు. తమ ప్రభుత్వం నీటి పారుదల శాఖలో 700 మంది ఇంజనీర్లను నియమిస్తున్నదని, ఇంజనీర్లుగా ఎంపికైన వారికి ఈ నెల 26న ఎర్రమంజిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మంత్రి ఉత్తమ్ మంగళవారం నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం, ఖమ్మం జిల్లా పరిధిలోని రంగుల వంతెన వద్ద సాగర్ కాల్వకు గండ్ల పూడ్చివేత పనులను, చిలుకూరు మండలం నారాయణపురంలో చెరువు కట్ట మరమ్మతులను కోదాడ ఎమ్మెల్యే పద్మావతి, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాల్వలపై క్షేత్ర స్థాయిలో పనిచేసే 1800 మంది లష్కర్‌లను త్వరలోనే నియమించనున్నట్లు తెలిపారు. అతిభారీ వర్షాల వల్ల కొంత నష్టం జరిగిందని ఎప్పటికప్పుడు సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రభుత్వ యంత్రాంగం నష్ట నివారణ కోసం పనిచేసిందన్నారు. ఇదంతా మరచి బీఆర్ఎస్ నేతలు రాజకీయాలు చేయడం తగదన్నారు. పదేళ్లలో జరిగిన వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. చెరువు భూమి ఆక్రమణకు గురైనట్లుగా చిలుకూరు మండలం నారాయణపురంలో గ్రామస్తులు పలువురు మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో.. ఆక్రమణదారుల నుంచి చెరువు భూమిని కాపాడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా చెరువు ఆక్రమణలను తొలగిస్తున్నామని చెప్పారు.



చిలుకూరు: నారాయణపురంలో తెగిన చెరువు కట్ట పనులపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి

**నేడు సాగర్ ఎడమకాల్వకు పూర్తిస్థాయిలో నీటి విడుదల**

నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు పూర్తి స్థాయిలో ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి ఖమ్మం జిల్లాలకు బుధవారం సాగర్ నీటిని విడుదల చేయనున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు. గండ్ల మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిపురం సమీపాన ఉన్న పాలారం మేజరు కాల్వ వరకు నీటిని విడుదల చేయడంతో మంత్రి ఎదుట కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు.. తమ పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చిలుకూరు మండలం నారాయణపురంలో చెరవు కట్ట మరమ్మతులకు రూ. 1.50కోట్లు మంజూరు చేయించామని, పది రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. రెడ్లకుంట మేజర్‌పై పడిన గుంత మరమ్మతుల అనంతరం నీటిని విడుదల చేయడంతో ఆ ప్రదేశాన్నీ మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ రమేష్‌బాబు, ఎస్‌సీ శివధర్మ తేజ, ఈఈ సత్యనారాయణ, డీఈ రఘు, తహసీల్దార్ వి.సరిత, ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్, ఏఈ సత్యనారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ఆర్డీఓ సూర్యనారాయణ, చిలుకూరు తహసీల్దార్ ధృవకుమార్, డీఈ స్వప్న, ఏఈ మానస పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలి



ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**చివ్వెంల(సూర్యాపేట) :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర తేజస్ నందలాల్ పవార్ సూచించారు. మంగళవారం చివ్వెంల మండల పరిధిలోని బీబీగూడెం గ్రామ శివారులోని శ్రీచైతన్య పాఠశాలలో చివ్వెంల, పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్), మోతె, సూర్యాపేట మండలాల ఉపాధ్యాయులకు నిర్వహించిన జాలిఫోనిక్స్ ట్రైనింగ్‌లో కలెక్టర్ మాట్లాడారు. ఆంగ్ల భాష నేర్చుకోవడంలో విద్యార్థులకు ఉన్న భయాన్ని తొలగించాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న మెళకువలు తరగతి గదిలో అమలు చేయాలన్నారు. ఆంగ్ల పదజాలం, మాతృ భాషలో దాని అర్థాలు, ఉచ్ఛారణ, కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంపొందించాలన్నారు. ఇది విద్యార్థుల అభ్యసనను మెరుగుపరుస్తుందన్నారు. ఆంగ్ల భాషలో ఉన్న విషయాన్ని తెలుగులో, తెలుగులో ఉన్న విషయాన్ని ఆంగ్లంలోకి అనువాదం చేయగల సమర్థత రావాలని కలెక్టర్ అకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి కె.అశోక్, క్వాలిటీ కోర్డినేటర్ దేవరశెట్టి జనార్దన్, కోర్సు కోఆర్డినేటర్ గోపాల్ రావు, జాలిఫోనిక్స్ రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ ఎస్‌వి గోమతి, హర్ష బన్సాలీ, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**అర్వపల్లి:** పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని జెడ్పీ సీఈఓ అప్పారావు అన్నారు. స్వచ్ఛతాహీ సేవలో భాగంగా మంగళవారం జాజిరెడ్డిగూడెంలో గ్రామపంచాయతీ సిబ్బంది, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డీపీఓ నారాయణరెడ్డితో కలిసి మాట్లాడారు. ఇళ్లలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని, వ్యర్థాలు, చెత్తను ట్రాక్టర్లలో వేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులను సన్మానించారు. పల్లె దవాఖానా, గ్రంథాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పవన్‌కుమార్, పల్లె దవాఖాన డాక్టర్ నగేష్, ఏపీఓ ఉపేందర్, పంచాయతీ కార్యదర్శి నెహ్రూనాయక్, హెల్త్ అసిస్టెంట్‌లు సైదమ్మ, శకుంతల, టీఏలు యాదమ్మ, దీపిక, నాగమణి, నాయకులు దాసరి సోమయ్య, బింగి కృష్ణమూర్తి, నర్సింగ వెంకటేశ్వర్లు, నిమ్మల నిరంజన్, రవికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ సిబ్బందిని సన్మానిస్తున్న సీఈఓ అప్పారావు, డీపీఓ నారాయణరెడ్డి

## బీజేపీ సభ్యత్వ నమోదు వేగవంతం

- మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

**చివ్వెంల(సూర్యాపేట) :** తెలంగాణలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోందని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్సీ, సభ్యత్వ నమోదు రాష్ట్ర ఇన్‌చార్జి రాంచందర్‌రావు అన్నారు. మంగళవారం రాత్రి సూర్యాపేట పట్టణంలోని 16వ వార్డులో నిర్వహించిన సభ్యత్వ నమోదులో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావుతో కలిసి పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పార్టీ సెల్ నంబర్ 8800002024కు మిస్డ్ కాల్ ఇచ్చి బీజేపీలో చేరుతున్నారన్నారు. వార్డు కౌన్సిలర్ సలిగంటి వీరేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు సంకినేని వరుణ్‌రావు, కిషన్, జుట్టుకొండ సత్యనారాయణ, ఆబిద్, రమేష్, మాధవరావు, శ్రీనివాస్ గౌడ్, శ్రీను, ఏకస్వామి, సురభి, విజయ్, భరత్ పాల్గొన్నారు.



సభ్యత్వం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, సంకినేని వెంకటేశ్వర్‌రావు

## ఎర్రవరం పీఏసీఎస్ సీఈఓగా మౌలాలి



సీఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న మౌలాలి

**కోదాడరూరల్ :** కోదాడ మండలం ఎర్రవరం పీఏసీఎస్ సీఈఓగా మౌలాలికి బాధ్యతలు అప్పగించినట్లు సంఘం చైర్మన్ నలజాల శ్రీనివాసరావు వెల్లడించారు. మంగళవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో చేసిన పలు తీర్మానాలను ఆయన తెలిపారు. ఎర్రవరం పీఏసీఎస్‌లో రుణమాఫీ జాబితాను ఆన్‌లైన్ చేయడంలో నిర్లక్ష్యం వహించిన సీఈఓ హుస్సేన్, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటేశ్వర్లును సంఘ సభ్యుల తీర్మానం మేరకు సస్పెండ్ చేసి తాత్కాలిక సీఈఓగా అక్కడే క్లర్క్‌గా పనిచేస్తున్న మౌలాలిని , కంప్యూటర్ ఆపరేటర్‌గా నీరజ్‌కుమార్‌ను నియమించామన్నారు. సంఘ చైర్మన్, సీఈఓకు జాయింట్ చెక్‌పవర్ ఉండే విధంగా కార్యవర్గ సభ్యులు తీర్మానం చేసినట్లు తెలిపారు. రుణమాఫీ కానీ రైతుల సమస్యను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిల దృష్టికి తీసుకెళ్లామని వారు అర్హులైన వారందరికీ మాఫీ వర్తించే విధంగా కృషి చేస్తామని తెలిపారన్నారు. సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన మౌలాలిని సభ్యులు, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కొప్పుల సుభాష్‌రెడ్డి, సభ్యులు నాన్‌రాజ్, గుగులోతు రవి, సూరపల్లి మంగమ్మ, అన్నెం రవీందర్ రెడ్డి, సుదర్శన్‌రావు, పాముల అశీర్వాదం, మందాది శ్రీను తదితరులు ఉన్నారు.

# చిగురిస్తున్న ఆశలు

- కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- అక్టోబర్ 2 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మార్గదర్శకాలపై రాని స్పష్టత



**నాగారం:** కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఆరేళ్లుగా కొత్త రేషన్‌కార్డుల కోసం నిరీక్షిస్తున్న వారికి ఊరట కలిగింది. ఆరేళ్లుగా కొత్త కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోవడంతో లబ్ధిదారులకు ఎదురు చూపులు తప్పడం లేదు. కొత్తగా పెళ్లయిన వారు, కుటుంబంలో జన్మించిన పిల్లల పేర్లు నమోదు, మార్పులు, చేర్పులు, కుటుంబాలు విడిపోయి కొత్తగా కార్డులు పొందాలిసిన వారంతా ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. రేషన్ కార్డుల జారీకి అక్టోబరు 2 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజల్లో ఆశలు చిగురించాయి.

**కీలకంగా మారిన రేషన్ కార్డు**

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు పొందాలంటే లబ్ధిదారులకు రేషన్ కార్డు తప్పనిసరిగా మారింది. నిన్నటి వరకు సాగిన రైతు రుణమాఫీ పథకం మొదలుకుంటే.. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇల్లు, గృహజ్యోతి, మహిళలకు ప్రతినెలా రూ.2,500, యువ వికాసం, గృహలక్ష్మి తదితర పథకాల వరకు అన్నింటికీ రేషన్ కార్డే ప్రామాణికంగా మారింది. దీంతో రేషన్ కార్డు కీలకంగా మారింది. ఇదిలా ఉండగా.. గతంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాలుగా, వార్షిక ఆదాయ పరిమితి ఆధారంగానే తెల్ల రేషన్ కార్డులు ఇచ్చారు. దీనిలో భాగంగా గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు, అర్బన్ రూ.2 లక్షల్లోపు ఆదాయాన్ని కార్డుల జారీకి ప్రాతిపదికగా తీసుకున్నారు. అలాగే భూ విస్తీర్ణం తరి భూమి అయితే 3.5 ఎకరాలు, మెట్ట భూమి అయితే 7.5 ఎకరాలలోపు ఉండాలనే నిబంధ నలు అమలు చేశారు. ఇప్పుడవే నిబంధనలు చేస్తారా? కొత్త మార్గదర్శకాలు నిర్దేశిస్తారా? అన్న అంశాలపై కూడా నేడోరేపో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతు న్నారు. కొత్తగా ఇచ్చే కార్డులు క్యూఆర్ కోడ్‌తో పకడ్బందీగా ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇప్పటికే జిల్లాలో 95 శాతం వరకు ఈకేవైసీ పూర్తి చేయించారు.

**వేలాది మంది ఎదురు చూపులు..**

గత ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల ప్రక్రియను నిలిపివేయడంతో జిల్లాలో వేలాది మంది కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం చౌకధర దుకాణంలో బియ్యం మాత్రమే అందిస్తుండగా.. వీటికి అదనంగా రాబోయే రోజుల్లో నిత్యావసర సరకులు సైతం పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. వచ్చే ఏడాది జనవరి నుంచి సన్న బియ్యం అందించనున్నట్లు సర్కారు ప్రకటించింది. ప్రజాపాలన ఆరు గ్యారంటీల దరఖాస్తుల సమయంలోనూ రేషన్ కార్డుల కోసం అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ఇటీవల రుణమాఫీ సమయం లోనూ రేషన్ కార్డు లేని పట్టాదారులకు రుణమాఫీ వర్తించలేదు.

**పేర్లు నమోదు చేయాలని 14,977 దరఖాస్తులు**

జిల్లాలో ప్రస్తుతం 3,24,185 ఆహారభద్రత కార్డులు ఉన్నాయి. వీటిలో 9,31,528 మంది మంది సభ్యులుగా నమోదై ఉన్నారు. ఆరేళ్లుగా కొత్త రేషన్ కార్డుల జారీ నిలిచిపోగా ఉన్న కార్డుల్లో కొత్తగా మార్పులు, చేర్పులకు అవకాశం లేకుండా పోయింది. అయినా మీసేవ కేంద్రాల్లో సభ్యులను జత చేసేలా ఆన్‌లైన్‌లో వెసులుబాటు కల్పించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా గతంలో 14,977 మంది ఆహార భద్రతకార్డుల్లో పేర్లు నమోదు చేయాలని దరఖాస్తులు సమర్పించారు.

**ఆదేశాలు రాగానే ప్రక్రియ ప్రారంభిస్తాం**



కొత్త రేషన్ కార్డుల ప్రక్రియపై ప్రభుత్వం నుంచి ఇప్పటికీ ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం కొత్తరేషన్ కార్డుల జారీకి కసరత్తు చేస్తుంది. ఈనెలాఖరులోగా రేషన్ కార్డుల జారీపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం ఉంచి ఆదేశాలు రాగానే అర్హులందరికీ కార్డులు జారీ చేస్తాం.

–డి.రాజేశ్వర్, జిల్లా పౌరసరఫరాల అధికారి, సూర్యాపేట

# ఇన్‌చార్జి ఎంఈఓల నియామకం

## గ్రేడ్–2 గెజిటెడ్ హెడ్ మాస్టర్లకు పూర్తి అదనపు బాధ్యతలు

**సూర్యాపేట టౌన్:** జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించే క్రమంలో క్షేత్రస్థాయిలో పాఠశాలల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రెగ్యులర్‌గా మండల విద్యాధికారుల (ఎంఈఓ) నియామకాల విషయంలో సుప్రీంకోర్టులో కేసు ఉన్నందున ప్రభుత్వం వివిధ పథకాలు, కార్యక్రమాలు, అకడమిక్ ఇన్‌స్పెక్షన్లు, అభ్యసన సామర్థ్యాల పెంపు వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు ఇన్‌చార్జి ఎంఈఓలను నియమించింది. మండల నోడల్ అధికారులుగా/గ్రేడ్ –2 గెజిటెడ్ హెడ్ మాస్టర్లుగా పనిచేస్తున్న వారికి పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ) అప్పగించింది. ఈ మేరకు పాఠశాల విద్యా డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

| మండలం | ఇన్‌చార్జి ఎంఈఓ | | | | |
|---|---|---|---|---|---|
| అనంతగిరి | టి. శ్రీనివాసరావు | జాజిరెడ్డిగూడెం | బాలునాయక్ | నాగారం | వి. ప్రభాకర్ |
| ఆత్మకూర్ ఎస్ | ధారాసింగ్ | కోదాడ | ఎం.డీ. సలీం షరీఫ్ | నేరేడుచర్ల | సత్యనారాయణ రెడ్డి |
| చిలుకూరు | గురవయ్య | మద్దిరాల | వెంకట్ నారాయణ | నూతనకల్ | రాములు నాయక్ |
| చింతలపాలెం | ఎన్. శ్రీనివాస్ | మఠంపల్లి | వెంకటాచారి | పాలకవీడు | కాటయ్య |
| చివ్వెంల | జి.కళారాణి | మేళ్లచెరువు | వెంకట్ రెడ్డి | పెన్ పహాడ్ | యన్. రవి |
| గరిడేపల్లి | చత్రునాయక్ | మోతె | గోపాల్ రావు | సూర్యాపేట | ఎస్. శ్రీనివాస్ గౌడ్ |
| హుజూర్‌నగర్ | భూక్య సైదా నాయక్ | మునగాల | పి. వెంకటేశ్వర్లు | తిరుమలగిరి | శాంతయ్య |
| | | నడిగూడెం | జి. ఉపేందర్ రావు | తుంగతుర్తి | బోయిని లింగయ్య |

### మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

**మఠంపల్లి:** మట్టపల్లి దేవాలయంలో శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మిసమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం విశేషంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, నిత్య హోమం పూర్తిచేసి శ్రీమూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల సంవాదం రక్తిగట్టించారు. అనంతరం నిత్యకల్యాణ తంతును వేదమంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన చేశారు. కాగా క్షేత్రపాలకుడైన శ్రీవీరాంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేకార్చనలు చేశారు.

## జాతీయ స్థాయి ప్రదర్శనలో 'హెల్మెట్‌పై వైపర్'



దుగ్గెపల్లిలో సోనియాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



బైక్ హెల్మెట్ వైపర్‌తో విద్యార్థిని

- ఈ నెల 17,18 తేదీల్లో ఢిల్లీలో ప్రదర్శన
- విద్యార్థినికి ఉపాధ్యాయుల సన్మానం

**త్రిపురారం :** మండలంలోని దుగ్గెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని సంక్రాంతి సానియా న్యూఢిల్లీలోని ప్రగతి మైదానంలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ జాతీయ స్థాయిలో ప్రదర్శనలో బైక్ హెల్మెట్‌పై వైపర్ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించింది. దీంతో మంగళవారం దుగ్గెపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు సోనియాను సన్మానించి అభినందించారు. జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు కృషి చేసిన గైడ్ టీచర్ ముదిరెడ్డి రాంరెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాబు, దశరథరాం, శ్రీలత, సోమయ్య, రాంరెడ్డి, మియాజాని, అసీఫ్ అలీ, కనక మహాలక్ష్మి, కరుణాకర్‌రెడ్డి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## ఇరువర్గాల దాడుల్లో ఎనిమిది మంది అరెస్ట్

**చౌటుప్పల్ :** పట్టణ కేంద్రంలోని 9వ వార్డు పరిధిలోని అంజనసాయిమెడోస్ వెంచర్ వద్ద సోమవారం రాత్రి జరిగిన ఇరువర్గాల ఘర్షణకు సంబంధించి ఎనిమిది మందిని మంగళవారం అరెస్ట్ చేశామని సీఐ మన్మథకుమార్ తెలిపారు. మద్యం మత్తులో ఉండి కారును అత్యంత వేగంగా నడుపుతున్న యువకులను ప్రశ్నించే క్రమంలో స్థానిక కౌన్సిలర్ దండ హిమబిందు భర్త అరుణ్‌కుమార్‌పై కారులోని యువకులు కత్తులతో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో కోపోద్రిక్తులైన స్థానిక యువకులు కారులోని యువకులపై ప్రతిదాడి చేశారు. దీనిపై రెండు కేసులు నమోదయ్యాయి. కత్తితో దాడి చేసిన విషయంలో హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ షారూఖ్, మహ్మద్ ఖాజా, మహ్మద్ మిన్హాజ్, తంగడపల్లికి చెందిన షేక్ నుమాన్‌లతోపాటు ప్రతిదాడి చేసిన కేసులో చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన మలిగె నవీన్, మలిగె సంతోష్, మలిగె రవి, మలిగె మహేష్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని సీఐ తెలిపారు. కాగా, అరుణ్‌కుమార్‌తో పాటు దాడిలో గాయపడిన బాధితులు హైదరాబాద్‌లోని వివిధ ఆస్పత్రులలో చికిత్సపొందుతున్నారు.

# విహారంలో విషాదం!



వైజాగ్ కాలనీ ప్రాంతంలోని నాగార్జునసాగర్ వెనుక జలాల్లో నిలిపిన మర బోట్లు

- ఆనందంగా గడుపుదామని వచ్చి అనంత లోకాలకు..
- సాగర్ వెనుక జలాల్లో వైజాగ్‌కాలనీ వద్ద వరుస ఘటనలు
- 2021నుంచి ఇప్పటి వరకు నీటమునిగి 20మంది మృత్యువాత
- తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ శాఖ హెచ్చరికలు




**చందంపేట :** నాగార్జునసాగర్ వెనుక జలాల అందాలను వీక్షించేందుకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులతో సరదాగా గడుపుదామని వచ్చే యాత్రికులు మృత్యువడికి చేరుతున్నారు. నేరెడుగొమ్ము మండలంలోని వైజాగ్‌కాలనీ సాగర్ వెనుక జలాల వద్ద వరుసగా జరుగుతున్న ఈ ఘటనలు విషాదాంతాలుగా మిగులుతున్నాయి. చిన్నచిన్న పొరపాట్లు ప్రాణాల మీదకు తెస్తున్నాయి. ఈత కోసం వెళ్లి నీటిలో మునిగి మృతి చెందిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఇటీవల కాలంలో వరుసగా కృష్ణా వెనుక జలాల్లో మునిగి మృతి చెందిన ఘటనలు చోటు చేసుకుంటుండడం ఒకింత కలవరపెడుతున్నాయి.

| సంవత్సరాల వారీగా మృతుల సంఖ్య | |
|---|---|
| సంవత్సరం | మృతి చెందిన వారి సంఖ్య |
| 2021 | 2 |
| 2022 | 4 |
| 2023 | 6 |
| 2024 (ఆగస్టు వరకు) | 8 |

**2021నుంచి ఇప్పటికి 20మంది మృత్యువాత..**

నేరెడుగొమ్ము మండలంలోని పరిధిలోని వైజాగ్‌కాలనీలోని కృష్ణా వెనుకజలాల్లో 2021వ సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 20మంది మృత్యువాత పడినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఈ ఘటనల్లో విహారయాత్ర కోసం వస్తూ మృత్యువాతపడుతున్న వారే అధికంగా ఉంటున్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు సాగర్ అందాలను చూసేందుకు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ మరబోట్లలో ప్రయాణం చేయడంతో పాటు, చేప రుచికి ఆకర్షితులై ఈ స్థలాన్ని యాత్రికులు ఎంపిక చేసుకుంటున్నారు. 2024సంవత్సరానికి సంబంధించి ఆగస్టు నెల వరకు 8మంది మృత్యువాత పడడం ఆందోళన కలిగిస్తోంది. ఎక్కువగా యువకులు మృత్యువాత పడుతుండడంతో ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునుగుతున్నాయి.

### చిన్న పొరపాట్లతోనే మృత్యువాత



ఎక్కడో దూరం నుంచి ఇక్కడికి సరదాగా గడిపేందుకు వస్తారు. చిన్న పొరపాట్లే వారిపాలిట శాపంగా మారుతున్నాయి. ఈత రాకున్న కృష్ణా జలాల్లోకి వెళ్తున్నారు. ఈక్రమంలో మునిగిపోయి చనిపోతున్నారు. చనిపోయిన వాళ్లలో ఎక్కువ మంది ఈత రాని వారు, యువకులే ఉన్నారు. ఈత రాకున్న సరదాగా నీళ్లలోకి దిగి ప్రాణాలు కోల్పోతున్నారు.

– ఊరె లక్ష్మణ్, వైజాగ్‌కాలనీ

### బోటింగ్ నిలిపివేశాం



వరుసగా కృష్ణా వెనుక జలాల ప్రాంతంలో మృత్యువాత పడుతున్న ఘటనలను చోటుచేసుకుంటున్న నేపథ్యంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టాం. ఇప్పటికే బోటింగ్‌ను నిలిపివేశాం. పర్యాటకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తూ ఫ్లెక్సీలను సైతం ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేయించాం. అంతేకాకుండా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే పర్యాటకులకు అనుమతి ఇస్తున్నాం. ప్రతి ఆదివారం ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం.

– సతీష్‌కుమార్, ఎస్ఐ, సతీష్‌కుమార్

## అనారోగ్యంతో హోంగార్డు మృతి

**హాలియా :** హాలియా పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు వసంత్‌కుమార్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామానికి చెందిన వసంత్‌కుమార్ హాలియాలోని అంగడిబజార్‌లో నివాసం ఉంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆరునెలలుగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం వరకు విధులు నిర్వర్తించిన వసంత్‌కుమార్ మంగళవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. హోంగార్డు వసంత్‌కుమార్ మృతి విషయాన్ని తెలుసుకున్న హాలియా ఎస్ఐ సతీష్‌రెడ్డి ఆస్పత్రిలో మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.



## విద్యుదాఘాతంతో రైతు మృతి



సతీష్‌రెడ్డి (ఫైల్)

**మఠంపల్లి :** విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని రఘునాథపాలెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు త్రిపురం సతీష్‌రెడ్డి(36) గ్రామానికి చెందిన మరొక రైతు పొలం కౌలు తీసుకుని సాగుచేస్తున్నాడు. ఈ క్రమంలో కౌలుకు చేస్తున్న పొలం వద్ద నీరు పెట్టేందుకు వెళ్లి విద్యుత్ మోటార్ ఆన్‌చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. భార్య అరుణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నడిగూడెంలో ఆవుకు రేబిస్

**నడిగూడెం :** మండల కేంద్రానికి చెందిన పుట్టపాక వెంకన్న ఆవుకు ఇటీవల పిచ్చికుక్క కరవడంతో రేబిస్ వ్యాధి సోకింది. దీంతో రెండు రోజులుగా వింతగా ప్రవరిస్తుండడంతో స్థానిక పశువైద్యశాలలో పరీక్షించడంతో పిచ్చికుక్కలు కరవడంతోనే రేబిస్ సోకిందని వైద్యాధికారి డాక్టర్.అఖిల తెలిపారు.

## ఆటో, టాటాఏస్ వాహనాలను ఢీకొన్న కారు



ఫల్టీపడిన ఆటో

**భువనగిరి క్రైం :** ఆటో ఫల్టీ కొట్టడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని వీరవెల్లి గ్రామస్టేజి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. వలిగొండ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన వేముల రాజు తన ఆటోలో ప్రయాణికులతో భువనగిరి నుంచి చాడ గ్రామానికి వెళ్తుండగా వీరవెల్లి బస్టాండ్ సమీపంలోకి రాగానే ఓ కారును ఆటోను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో మూడు ఫల్టీలు కొట్టి పక్కనే ఉన్న పొలంలో పడిపోయింది. దీంతో కారును ఆపే ప్రయత్నం చేయగా మరీ వేగంగా వెళ్లి ముందుగా వెళ్తున్న టాటాఏస్ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో టాటాఏస్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు వేముల రాజుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

## ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు

- 25క్వింటాళ్ల బెల్లం, 60కేజీల పటిక, 5లీటర్ల సారా పట్టివేత



పట్టుబడిన బెల్లం లోడు ట్రాక్టర్‌తో అధికారులు

**ఆత్మకూర్(ఎస్) :** మండలంలోని మంగళతండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఈర్యతండా, కక్రోనితండాలలో మంగళవారం తెల్లవారుజామున ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటు సారా తయారీ కోసం అక్రమంగా తరలిస్తున్న, నిల్వఉంచిన 25క్వింటాళ్ల నల్లబెల్లం, 60కేజీల పటిక, 5లీటర్ల సారా, ఒక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మల్లయ్య తెలిపారు. ఈదాడుల్లో బెల్లం తరలిస్తున్న వీర్యతండాకు చెందిన గుగులోత్ అలేందర్‌ను అదుపులోకి తీసుకోగా, జాజిరెడ్డిగూడెం మండలం సూర్యానాయక్ తండాకు చెందిన లునావత్ వెంకన్న, కక్రోనితండాకు చెందిన గుగులోత్ లింగ్యాలు పరారైనట్లు వెల్లడించారు.

**అసలు నిందితులను, లారీని వదిలేశారంటూ స్థానికుల ఆరోపణ..**

కర్నూలుకు చెందిన ఓ లారీ ఈ తండాలకు నల్లబెల్లం చేరవేస్తుందని, సోమవారం రాత్రి సూర్యాపేట నుంచి జాజిరెడ్డిగూడెం మండలం కోమటిపల్లి సమీపంలోని సూర్యనాయక్‌తండాకు వచ్చి మారుమూల ప్రాంతంలో బెల్లాన్ని ట్రాక్టర్లు, ఆటోలకు సరఫరా చేస్తుందని, ఆ లారీని, బెల్లం సప్లై చేసే వ్యక్తిని అధికారులు వదిలేసినట్లు స్థానికులు ఆరోపించారు. బెల్లం వ్యాపారి సూర్యాపేట పట్టణంలోని ఓ కిరాణ దుకాణం నిర్వహిస్తున్నట్లు, ఇదంతా అధికారులకు తెలుసని ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వారిని వదిలేసి సామాన్యులను పట్టుకొన్నారని ఆరోపించారు.

**ఎక్సైజ్ అధికారుల తనిఖీలు**

**హుజూర్‌నగర్ :** నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఎక్సైజ్ అధికారులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నలుగురు వ్యక్తులు పట్టబడగా వారి వద్ద నుంచి 4ద్విచక్ర వాహనాలు, 34లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలోసీఐ నాగార్జునరెడ్డి తనిఖీ వివరాలను వెల్లడించారు. మట్టంపల్లి మండలంలోని కొత్తతండాకు చెందిన భూక్యా వస్రాం తన ద్విచక్రవాహనంపై 16లీటర్ల సారా తరలిస్తుండగా మట్టంపల్లి వద్ద పట్టుకుని వాహనాన్ని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా కొత్తతండాకు చెందిన బానోత్ బాల తన ద్విచక్రవాహనంపై 4లీటర్ల సారా తరలిస్తుండగా చిత్రియాల వద్ద పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. మట్టంపల్లి మండలంలోని రఘునాథపాలెంకు చెందిన హసన్ మీరా తన ద్విచక్ర వాహనంపై 10లీటర్ల సారా తరలిస్తుండగా మట్టంపల్లి వద్ద సారాతో పాటు వాహనాన్ని సీజ్ చేశామన్నారు. చింతలపాలెం మండలం పీక్లానాయక్‌కు చెందిన బానోతు సక్రూ తన ద్విచక్రవాహనంపై 4లీటర్ల సారా తరలిస్తుండగా తమ్మరం వద్ద పట్టకుని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు జగన్మోహన్‌రెడ్డి, దివ్య, సిబ్బంది నాగరాజు, రవి, కుమార్, రుక్మారెడ్డి, ధనుంజయ్, అంబేద్కర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు కాలుపై వెళ్లడంతో వ్యక్తి గాయాలు

**డిండి :** ఓ వ్యక్తి కాలుపై ఆర్టీసీ బస్సు వెల్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట డిపోకు చెందిన ఏపీ29జెడ్ 0357 నంబర్ గల ఆర్టీసీ బస్సు అచ్చంపేట నుంచి దేవరకొండకు వెళ్తోంది.ఈ క్రమంలో మార్గమధ్యలోని మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ లోపలికి వస్తోంది. ఈ క్రమంలో దేవరకొండకు వెళ్లడానికి వేచిఉన్న డిండి మండల కేంద్రానికి చెందిన సింగజోగి సత్యనారాయణ సీటు వేయడం కోసం బస్సు దగ్గరకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు అతడి కాలు బస్సు టైర్ కింద పడడంతో నుజ్జునుజ్జయ్యింది. దీంతో సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం అతడిని నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.








## అదృశ్యమైన వ్యక్తి చెరువులో శవమై తేలాడు



రాజ్‌కమల్ (ఫైల్)

**భువనగిరి క్రైం :** రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమైన ఓ యువకుడు చెరువులో శవమై తేలాడు. పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తాతానగర్‌కు చెందిన ముదిగొండ రాజ్‌కమల్(23) ఈనెల 22న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈ మేరకు సోమవారం కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి దగ్గర వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భువనగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం భువనగిరి చెరువులో ఓ మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో అక్కడి వెళ్లి పోలీసులు పరిశీలించగా రాజ్‌కమల్‌గా గుర్తించారు. రాజ్‌కమల్ చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- భర్తను హత్య చేసిన భార్య
- వివరాలు వెల్లడించిన సీఐ సురేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఐ సురేందర్‌రెడ్డి

**సూర్యాపేట :** వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని కట్టుకున్న భర్తను హత్య చేసింది ఓ భార్య. ఈ కేసులో నిందితురాలుని స్థానిక పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం సూర్యాపేటరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి కేసు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సూర్యాపేట మండలంలోని హనుమానాయక్‌తండాకు చెందిన ధరావత్ కౌసల్య అదే తండాకు చెందిన మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ వివాహేతర సంబంధానికి తన భర్త ధరావత్ సైదా అడ్డొస్తున్నాడని, అతడిని ఎలాగైనా తొలగించుకోవాలనే ఆలోచనతో ఆగస్టు 17న రాత్రి భర్త సైదాను కౌసల్య గొడ్డలితో కణతపై నరికి హత్య చేసింది. అనంతరం ఏమి తెలియనట్లు తన భర్త మద్యం సేవించి తూలి చెక్కబల్లపై పడి మృతి చెందినట్లు అందరిని నమ్మించింది. ఈ హత్యను కౌసల్య చిన్న కుమారుడు వినోద్ చూడడంతో అతడిని బతిమిలాడి హత్య విషయాన్ని బయట తెలిస్తే నేను జైలుకు వెళ్తానని, అప్పుడు మీరు బతకడం కష్టమవుతుందని, ఎవరికి ఈ విషయాన్ని చెప్పనివ్వలేదు. ఈనెల 22న కౌసల్య తన చిన్న కుమారుడు వినోద్‌తో గొడవ పెట్టుకోగా వినోద్ తన తండ్రిని తన తల్లి కౌసల్యే హత్య చేసిన విషయం అన్న సాయికుమార్‌కు చెప్పాడు. దీంతో సాయికుమార్ ఈనెల 23న రూరల్‌పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసి నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అదే విధంగా నిందితురాలు హత్యకు ఉపయోగించిన గొడ్డలిని సీజ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో సిబ్బంది పాల్గొన్నారు.

## భూతగాదాలతో ఇరువర్గాల ఘర్షణ



కూల్చిన మల్లారెడ్డి ఇల్లు

**మద్దిరాల :** భూతగాదాలతో ఇరువర్గాల మధ్యన సోమవారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది. మంగళవారం పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నవ్వుల మల్లారెడ్డి, వల్లపు రమేష్‌కు కొంతకాలంగా భూతగాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి వల్లపు రమేష్ మల్లారెడ్డి ఇల్లును ధ్వంసం చేశాడు. దీంతో మల్లారెడ్డి రమేష్ జేసీబీ, బొలెరో వాహనాలను తగులబెట్టినట్లు తెలిపారు. దీంతోఇరువర్గాల ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.వీరన్న తెలిపారు.

## అర్ధరాత్రి దారి దోపిడీ



గాయపడిన నవీన్

**నేరేడుచర్ల :** అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై ఒంటరిగా వెళ్తున్న ఓ వ్యక్తిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి రూ.8వేలను దోపిడీ చేశారు. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన సనికొండ నవీన్ నేరేడుచర్లలోని మున్సిపల్ రోడ్డులో మహాలక్ష్మి పెయింటింగ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే నవీన్ తన షాపును బంద్ చేసుకొని తన ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలోని పెంచికల్‌దిన్నె గ్రామ సమీపంలోకి రాగానే రెండు ద్విచక్రవాహనాలపై నలుగురు వ్యక్తులు వచ్చి నవీన్ వాహనాన్ని అడ్డగించి కల్లూరు గ్రామానికి దారి ఎటూ అని అడిగారు. అందుకు నవీన్ నిరాకరించడంతో అతడిపై దుండగులు దాడికి చేసి అతడి జెబులో ఉన్న రూ.8వేలను తీసుకెళ్లడంతో పాటు కొద్దిదూరం వెళ్లిన అనంతరం మరలవచ్చి సెల్‌ఫోన్‌ను కూడా ధ్వంసం చేసి వెళ్లారు. వెంటనే బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ దాడికి సంబంధించి ఏమైనా పాత కక్షలు ఉన్నాయా..? కేవలం డబ్బుల కోసమేనా..? తెలిసిన వారి పనేనా..? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. సంఘటనా స్థలాన్ని హుజూర్‌నగర్ సీఐ చలమందరరాజు పరిశీలించారు. నేరేడుచర్ల, గరిడేపల్లి, పాలకవీడు ఎస్ఐలు రవీందర్, నరేష్, లక్ష్మీనర్సయ్య పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన నవీన్‌ను ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ వెల్లడించారు.

### నగదు, బంగారు ఆభరణాలు చోరీ

**మఠంపల్లి :** ఓ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి నగదు, బంగారు ఆభరణాలను చోరీ చేశారు. ఈ ఘటన మండలంలోని చౌటపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మోదుగు జాన్‌రెడ్డి, అతడి భార్య ఉదయాన్నే పొలం పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వేర్వేరుగా వెళ్లారు. సాయంత్రం ఇద్దరు ఇంటికి చేరుకుని ఇంటికి వేసిన తాళం తీసి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఉంది. దీంతో బీరువాలో ఉన్న రూ.10వేల నగదు, రెండు బంగారు ఉంగరాలు, రెండు జతల దిద్దులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వాటివిలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని లబోదిబోమంటూ వాపోయారు. ఈ విషయమై మండల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

## చోరీ కేసులో ఐదుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్



పోలీసులు సీజ్ చేసిన బంగారు, వెండి ఆభరణాలు

- 6.5తులాల బంగారం, 30తులాల వెండి, రూ.38,250 నగదు స్వాధీనం
- కేసు వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

**సూర్యాపేటటౌన్ :** చోరీ కేసులో ఐదుగురు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు సూర్యాపేట జిల్లా పోలీసులు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను స్థానిక ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ వెల్లడించారు. మేళ్లచెరువు శివారులోని వెల్లటూరుకాలనీలో ఈనెల 19న తెల్లవారుజామున 3గంటల సమయంలో ఐదుగురు దొంగలు తమ్మిశెట్టి వెంకయ్య అనే ఇటుకల వ్యాపారి ఇంట్లో తలుపులు పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఆయుధాలతో వెంకయ్యను, ఇద్దరు కూతుర్లను బెదిరించి వారిపై ఉన్న 6.5తులాల బంగారు ఆభరణాలు, 30తులాల వెండి, రూ.50వేల నగదును దొంగతనం చేసి పారిపోయారు. ఈ నేపథ్యంలో బాధితుడు తమ్మిశెట్టి వెంకయ్య మండల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు డెకాయిటి దొంగతనం కేసుగా నమోదు చేసినట్లు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కోదాడరూరల్ సీఐ రజితరెడ్డి తన సిబ్బందితో అనంతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఖమ్మం రహదారిపై శాంతినగర్ వద్ద మంగళవారం ఉదయం వాహనాల తనిఖీలు చేస్తుండగా అనుమానంగా వస్తున్న ఇన్నోవా కారును గుర్తించి తనిఖీ చేశారు. ఆ కారులో కూర్చున్న ఐదుగురు వ్యక్తులను విచారించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్‌టీఆర్ జిల్లాకు చెందిన వేమవరపు నాగరాజు, వేమవరపు పుల్లారావు, భిక్షాలు, నల్లగొండ జిల్లాకు చెందిన రమావత్ మాత్రు, నాగూర్‌కర్నూల్ జిల్లాకు చెందిన చిక్కుల అంజనేయులుగా తెలిపారు. విచారణలో భాగంగా వారు ఇటుకల వ్యాపారి ఇంట్లో దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నారు. దీంతో వారిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ.1,62,250 విలువగల 6.5తులాల బంగారు అభరణాలు, రూ.12వేల విలువ గల 30తులాల వెండి, రూ.38,250 నగదు, నేరానికి ఉపయోగించిన ఇన్నోవా కారు, ఐదు మొబైల్స్, ఐదు కత్తులు, రెండు చేతి గ్లౌజులు, మాస్క్‌లను సీజ్ చేసి స్వాధీనం చేసినట్లు, ఈ కేసులో మరోక నిందితుడు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. కేసులో ఆటోడ్రైవర్ ఇచ్చిన కీలక సమాచారంతో కేసును చేధించామని ఎస్పీ తెలిపారు. అనంతరం ఆటో డ్రైవర్‌కు సన్మానం చేశారు. సమావేశంలో ఏఎస్పీ నాగేశ్వర్ రావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రజితరెడ్డి, ఎస్ఐలు పరమేష్, నవీన్, అనిల్‌రెడ్డి, ఎస్ఐ సైదిరెడ్డి, సీసీఎస్ సిబ్బందిని పాల్గొన్నారు. ఈ కేసును చేధించిన సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డ్ అందజేశారు.